



రీ సర్వే వివరాలు తెలుసుకుంటున్న సిసోడియా

క్షేత్రస్థాయి పరిశీలనతో భూ సమస్యలు పరిష్కారం

రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్‌పి.సిసోడియా

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

భూముల రీసర్వేకు సంబంధించి అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తే సమస్యలు పరిష్కారం అవుతాయని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్‌పి.సిసోడియ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని పిజిఆర్‌ఎస్ సమావేశ మందిరంలో పిజిఆర్ ఎస్, రీ సర్వే, రెవెన్యూ సదస్సులు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ టిఎస్.చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్‌ఒ విజయ సారధి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భూముల వర్గీకరణతో కూడిన ప్రత్యేక మ్యాప్ తయారు చేయాలని తెలిపారు. భూములకు సంబంధించి క్షేత్ర స్థాయి పరిశీలన చేసి సమగ్ర వివరాలతో కూడిన రికార్డులను తయారు చేయాలన్నారు. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు సువర్ణ, శర్మ, మహేష్, ఆనంద్ కుమార్, జిల్లాలోని తహశీల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వినతి

పుట్టపర్తి క్రైమ్ : కడప ఎంపీ అవినాష్ రెడ్డి ప్రోద్బలంతో తన భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేశారని, న్యాయం చేయాలని కోరుతూ సత్యసాయి భక్తుడు తాన్సేన్ రామ్ ప్రకాష్ రాష్ట్ర రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియాకు వినతి పత్రం అందజేశారు.



రీ సర్వేకు సంబంధించి క్షేత్ర స్థాయిలో వివరాలు తెలుసుకుంటున్న సిసోడియా

అందరి సహకారంతో బాలోత్సవం విజయవంతం

బాలోత్సవ కమిటీ ఛైర్మన్ షమీమ్ షఫీవుల్లా

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లా ప్రజలందరి సహకారంతో అనంత బాలోత్సవం-5 విజయవంతం అయ్యిందని అనంత బాలోత్సవం కమిటీ ఛైర్మన్ షమీమ్ షఫీవుల్లా తెలిపారు. అనంత బాలోత్సవం- 5 మూడు రోజుల పిల్లల పండుగ ఈ నెల 14, 15, 16వ తేదీల్లో అనంతపురం నగరంలో విజయవంతంగా ముగిసింది. ఈ నేపథ్యంలో నగరంలోని రామ్‌నగర్ క్రీసెంట్ స్కూల్లో ఛైర్మన్ షమీమ్ షఫీవుల్లా ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, బాలోత్సవ న్యాయనిర్ణేతలు, వాలంటీర్లకు అభినందన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా షమీమ్ షఫీవుల్లా మాట్లాడుతూ మూడు రోజుల పాటు పిల్లల పండుగను దిగ్విజయంగా నిర్వహించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. పిల్లల కళాప్రదర్శన ప్రతిభా పాటవాలను దగ్గరుండి చూసి ఎంతో ఆనందాన్ని కలిగిందన్నారు.న్యాయనిర్ణేతలు, వాలంటీర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యాలు, విద్యా శాఖ అధికారులు, కలెక్టర్, యంత్రాంగం నుంచి అందించిన సహకారం మరువలేనిది అన్నారు. వచ్చే ఏడాది నిర్వహించే బాలోత్సవం మరింత పటిష్టంగా, ప్రణాళికతో నిర్వహించేందుకు సూచనలు సలహాలు అందించాలని కోరారు. అనంతరం న్యాయనిర్ణేతలు, వాలంటీర్లు, కమిటీ సభ్యులు, మీడియా పాత్రికేయులకు అనంత బాలోత్సవం జ్ఞాపిక, ప్రశంస పత్రాలు అందించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అనంత బాలోత్సవం కమిటీ కార్యదర్శి శ్రీనివాసరావు, కార్యనిర్వాహక కార్యదర్శి వి.సావిత్రి, కోశాధికారి జిలాన్, కమిటీ సభ్యులు ఎస్‌వివి.రమణయ్య, వి.కోటేశ్వరప్ప, గోవిందరాజులు, రమణారెడ్డి, సరళ, దేవేంద్రమ్మ, చంద్రిక, రామాంజినమ్మ, అశ్విని, సురేష్, గిరి, న్యాయ నిర్ణేతలు పాల్గొన్నారు.

లైనింగ్‌పై విముఖత


◆ భూగర్భ జలాలు తగ్గుతాయని రైతుల ఆందోళన ◆ హంద్రీనీవా రెండవ దశ పనులకు ప్రభుత్వం సిద్ధం

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

హంద్రీనీవా రెండవ దశ లైనింగ్ పనులను రాష్ట్ర ప్రభుత్వం ఆఘమేఘాలపై చేపట్టాలని భావిస్తోంది. ఇందుకు అనుగుణంగా ఆదేశాలను జారీ చేసింది. టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది. పనులను ప్రారంభించేందుకు కాంట్రాక్టర్లు జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. లైనింగ్ పనులు చేపడితే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు లైనింగ్ లేకపోవడంతో కాలువకు అటూఇటు పది కిలోమీటర్ల మేర భూగర్భజలాలు పెరిగాయి. దీంతో రైతులు అయా ప్రాంతాల్లో ఉద్యానవన పంటలు సాగు చేసుకుంటున్నారు. ఇప్పుడు లైనింగ్ చేపడితే భూగర్భజలాలు తగ్గి పోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. విపక్షాలు కూడా లైనింగ్ వద్దని డిమాండ్ చేస్తున్నారు.

184 కిలోమీటర్లు లైనింగ్

హంద్రీనీవా. రెండవ దశ జీడిపల్లి జలాశయం నుంచి ప్రారంభం అవుతుంది. 216 కిలోమీటరు నుంచి 400 కిలోమీటరు వరకు లైనింగ్ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం చేసింది. రూ.936 కోట్లతో ఈ పనులు చేపట్టారు. ప్రధానంగా సాగునీటి వనరుల్లేని



సత్య సాయి జిల్లాలో ఉంటుంది. ఇక్కడి రైతులకు హంద్రీనీవా ప్రధాన వనరుగా ఉంది. దీని కింద కూడా ఆయకట్టు లేదు. దీంతో భూగర్భ జలాలపైనే ఆధారపడి పంటలు పండిస్తున్నారు. అందుకే రైతులు లైనింగ్‌ను వ్యతిరేకిస్తున్నారు.

లైనింగ్ వద్దు ...వైడనింగ్ చేయాలి



జిల్లాకు ఇప్పుడు వస్తున్న నీళ్లు సరిపోవు. ఈ పరిస్థితుల్లో హంద్రీనీవా కాలువ వెడల్పు చేయాలని కోరుతుంటే ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. లైనింగ్ కాకుండా వైడనింగ్ చేపట్టాలని కోరుతున్నాం.

వి.రాంభూపాల్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ప్రజాశక్తి-గుడిబండ

ప్రతి రైతు తప్పని సరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి వీరనరేష్ సూచించారు. ఏవో గురువారం మండలంలోని రాళ్లపల్లి, శంకర గల్లు రైతు సేవా కేంద్రాలను సందర్శించి రైతు రిజిస్ట్రేషన్ ప్రక్రియను తనిఖీ చేశారు. ఏవో మాట్లాడుతూ మండలంలో వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతూ తప్పనిసరిగా సంబంధిత రైతు సేవా కేంద్రానికి వెళ్లి ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకుని ఐడి పొందాలన్నారు. ఆయన వెంట రైతు సేవా కేంద్రం అధికారులు నరేష్, ప్రసన్న, రైతులు ఉన్నారు.



ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఏవో వీరనరేష్

రుణాల మంజూరులో నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రుణ మంజూరులో ఎలాంటి నిర్లక్ష్యం చేయొద్దని కలెక్టర్ టిఎస్. చేతన్ బ్యాంకర్లు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లక్ష్యసాధన ప్రగతిపై బ్యాంకర్లు వివిధ ప్రభుత్వ అధికారులతో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు బ్యాంకర్లతో సమన్వయం చేసుకుని అర్హులైన వారికి రుణాలు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాంకర్ల భాగస్వామ్యంతో జిల్లా స్థిరమైన వద్ధిరేటు సాధనకు కృషి చేద్దామన్నారు. స్టాండప్ ఇండియా పిఎం ఈజిపి, చేనేత కార్మికుల రుణాలు అందజేయాలన్నారు. లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో సమీక్ష సమా వేశాలు నిర్వహించుకోవాలన్నారు. మంగళవారం లోపు రుణాలు అందించే నివేదికలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. నాబార్డ్ ఆధ్వర్యంలో పథకాలు అమలు చేస్తున్నారో వాటికి సంబంధించిన సమావేశాలు నిర్వహించాలని లీడ్ బ్యాంకు మేనేజర్‌ను ఆదేశించారు. వంద శాతం లక్ష్యాలను పూర్తి చేయాలని నిర్లక్ష్యం వహించరాదన్నారు. పశు సంవర్ధక మత్స్య శాఖలకు చెందిన రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు అందజేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకాలను నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా సాధించాలన్నారు. కేటాయించిన లక్ష్యాలను సాధించకపోతే బ్యాంకర్ల పనితీరు బాగో లేదని ఆయా శాఖల ఉన్నతాధికారులకు తెలపాల్సి వస్తుందని బ్యాంకులను హెచ్చరించారు. కార్యక్రమంలో రిజర్వ్ బ్యాంకు ప్రతినిధి గంగాధర్, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, పట్టు పరిశ్రమ జేడీ పద్మమ్మ, ఎపిఎస్‌ఐపి పీడీ సుదర్శన్, ఉద్యానవన శాఖ డిడి చంద్రశేఖర్, లీడ్ బ్యాంకు మేనేజర్ రమణకుమార్, డిక్కీ ప్రతినిధి వెంకటరమణ, గిరిజన సంక్షేమ అధికారి మోహన్‌రావు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగప్రసాద్, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

కలెక్టర్ టిఎస్.చేతన్



సమావేశంలో పాల్గొన్న బ్యాంకర్లు, సిబ్బంది (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్)

అంగన్వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ

అడ్డుకున్న కబ్జాదారుల కుటుంబ సభ్యులు.. పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం

ప్రజాశక్తి-పెనుకొండ

మండలంలోని శెట్టిపల్లి పంచాయతీ బొజ్జారెడ్డిపల్లిలో నకిలీ పత్రాలతో రిజిస్టర్ చేసుకున్న భూమిని రెవెన్యూ అధికారులు అసలైన వారసులకు అప్పగించిన విషయం తెలిసిందే. అందులో భూమి వారసులు అంగన్వాడీ భవన నిర్మాణానికి 10 సెంట్లు ఇవ్వగా గురువారం అధికారులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా భూమి వారసులు, కబ్జాదారుల కుటుంబాలకు మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. వివరాలు.. బొజ్జారెడ్డిపల్లిలో 28 సెంట్ల భూమి రెవెన్యూ రికార్డుల ప్రకారం వెంకోబారావు పేరుపై ఉంది. ఆయన ఈ భూమిని తన వారసురాలు సరోజమ్మకు పసుపు కుంకుమ కింద రాసిచ్చారు. 2000 సంవత్సరంలో రెవెన్యూ అధికారులు సరోజమ్మ పేరుపై పట్టాదారు పాసు బుక్కులు మంజూరు చేశారు. కొన్నేళ్లుగా సరోజమ్మ కుటుంబ సభ్యులు హిందూపురంలో నివాసం ఉంటున్నారు. ఇది పసిగట్టిన వైసిపికి చెందిన సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు కృష్ణారెడ్డి తన భూమి పక్కనే ఉన్న ఈ భూమికి నకిలీ పత్రాలు సృష్టించి తన భార్య పేరుపై 2022లో బుక్కపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేయించాడు. విషయం తెలుసుకున్న సరోజమ్మ కుమారులు రెవెన్యూ అధికారులను సంప్రదించగా వారు రికార్డులను పరిశీలించి ఈ భూమి సరోజమ్మకు చెందుతుందని నిర్ధారించారు. దీంతో సరోజమ్మ కుమారులు చలపతిరావు, రాఘవేంద్రరావు, అరుణ్ కుమార్ అందులో 10 సెంట్లను అంగన్వాడీ భవన నిర్మాణానికి దానం చేస్తూ తహశీల్దార్ శ్రీధర్‌కు తెలిపారు. దీంతో గురువారం రెవెన్యూ అధికారులు, పోలీసులు బొజ్జారెడ్డిపల్లికి చేరుకొని అంగన్వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ చేసేందుకు సిద్ధమయ్యారు. అక్కడే ఉన్న కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు రెవెన్యూ అధికారులు, భూ యజమానులతో వాగ్వాదానికి దిగారు. ఈ భూమి వ్యవహారం కోర్టు పరిధిలో ఉందని తీర్పు వచ్చేవరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని అడ్డుకున్నారు. ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరుకుంది. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి వారికి నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు. అనంతరం భూమి జెసిబితో శుభ్రం చేయించి అంగన్వాడీ భవన నిర్మాణానికి స్థల దాతలు చలపతిరావు, రాఘవేంద్రరావు, అరుణ్‌కుమార్, తహసిల్దార్ శ్రీధర్, ఆర్ఐ భాస్కర్‌రెడ్డి భూమిపూజ చేశారు. అలాగే సర్వేయర్ భరద్వారాజ్, వీఆర్వో తేజ, తదితరులు భూమి కొలతలు వేసి యజమానులకు అప్పగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గోరంట్ల సిఐ శేఖర్, పెనుకొండ, రొద్దం, పరిగి ఎస్ఐలు వెంకటేశ్వర్లు, నరేంద్రకుమార్, రంగడు పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



చదును చేస్తున్న జెసిబిని అడ్డుకుంటున్న మహిళలు

బడుగుల ఆశాజ్యోతి నరేంద్ర సింగ్ బేడీ

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-పెనుకొండ

బడుగుల ఆశాజ్యోతి నరేంద్ర సింగ్ బేడీ అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. యంగ్ ఇండియా వ్యవస్థాపకుడు నరేంద్ర సింగ్ బేడీ సంస్మరణ సభను గురువారం పట్టణంలోని షాదీ మహల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అసంఘటిత కార్మికుల్లో చైతన్యం తీసుకొచ్చి వారి హక్కులు సాధించుకోవడం కోసం నిరంతరం సామాజిక ప్రజా ఉద్యమాలు నిర్మించిన ఘనత యంగ్ ఇండియా ప్రాజెక్ట్ వ్యవస్థాపకులు నరేంద్ర సింగ్ బేడీకి దక్కుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో భూస్వామ్య పెత్తందారీ వ్యవస్థలకు వ్యతిరేకంగా చైతన్యం తీసుకురావడానికి గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు వ్యవసాయ కూలీల యూనియన్ ఏర్పాటు చేసి పోరాటాలు చేశారని కొనియాడారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం, జాతీయ వికలాంగుల హక్కుల సంరక్షణ చట్టం పంచాయతీరాజ్ చట్టం తదితర అనేక పేదల ప్రయోజనకరమైన పథకాలు చట్టాలు అమల్లోకి తీసుకురావడంలో బేడి పాత్ర మరువలేనిదన్నారు. నరేంద్ర సింగ్ బేడీ సమాజానికి చేసిన సేవలకు గుర్తింపుగా ఇండియన్ శ్రామిక సేవ రత్నగా కీర్తించారు. ఈ సంస్మరణ సభలో నరేంద్ర సింగ్ బేడి సతీమణి సోనియా బేడీ కుటుంబ సభ్యులు, యంగ్ ఇండియా ప్రాజెక్ట్ సీనియర్ ప్రతినిధులు కృష్ణమూర్తి, వెంకటస్వామి, వెంకటేశులు, బలరాం, రాజారెడ్డి, క్రిష్టప్ప, నరసింహులు బద్రిస్ భానుజా, రామాంజనేయులు, కేశవయ్య, టింబక్టు బబ్లు మేరీ, రాప్తాడు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకష్ణ



మంత్రి సవితకు పూలమొక్క ఇస్తున్న సాయి

మంత్రి సవితను కలిసిన సాయిప్రసాద్

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

విజయవాడలోని రాష్ట్ర సచివాలయంలో గురువారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవితమ్మను ఆమె క్యాంప్ కార్యాలయంలో టిడిపి జిల్లా ఆఫీస్ సెక్రటరీ సాయిప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మంత్రి సవితకు పూలమొక్క అందజేశారు.

బాలుర హాస్టల్ తనిఖీ

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని బిసి బాయ్స్ హాస్టల్‌ని గురువారం పెనుకొండ ఆర్‌డిఒ ఆనంద్‌కుమార్ తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం, వసతులపై ఆరా తీశారు. ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని వార్డెన్‌ను ఆదేశించారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, విఆర్‌ఒలు గంగరత్నమ్మ, రమేష్, హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు ఎంపికి ఆహ్వానం

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పట్టణంలోని భోగసముద్రం చెరువు సమీపంలో బిజెవిపిఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు హాజరుకావాలని కమిటీ సభ్యులు గురువారం ఎంపి బికె.పార్థసారధిని ఆహ్వానించారు. కమిటీ సభ్యులు పట్టణంలోని ఎంపి కార్యాలయంలో ఎంపిని కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఎంపి బికె పార్థసారధికి ఆహ్వానపత్రిక ఇస్తున్న నాయకులు

గ్రూప్-2 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఈనెల 23న జరిగే ఏపీపీఎస్సీ గ్రూపు 2 మెయిన్ రాత పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి విజయనంద్ ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ఏపీపీ ఎస్సీ చైర్మన్ అనురాధ తో కలిసి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విజయనంద్ సమీక్షించారు. పుట్టపర్తి కలెక్టరేట్లో కలెక్టర్ తో పాటు డిఆర్‌ఒ విజయసారథి గ్రామ వార్డు సచివాలయాల మోడల్ అధికారి సుధాకర్ రెడ్డి, డిపిఒ సమత, పరిశ్రమల జిఎం నాగరాజు, ఆర్ఐఒ రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలోని 13 పాత జిల్లా కేంద్రాల్లోని 175 పరీక్ష కేంద్రాలలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పరీక్షలలో 92,250 మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించడానికి కలెక్టర్లు, ఎస్పీలు సంబంధిత అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ టిఎస్.చేతన్

కౌలు రైతులకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

కౌలు రైతులకు వడ్డీ లేని రుణాలు అందించాలని జిల్లా కౌలు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ప్రశాంతి గ్రామ్ వద్ద గల లీడ్ బ్యాంకు మేనేజరు రమణ కుమార్‌కు ఆ సంఘం నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు అడపాల వేమనారాయణ మాట్లాడుతూ, జిల్లాలో కౌలు రైతులు గణనీయంగా ఉన్నారని పంటలు పండిస్తున్న రైతులకు బ్యాంకులు పంట రుణాలు ఇవ్వడం లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కౌలు రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు మంజూరు చేయాలని, పంట సాగును బట్టి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చౌడప్ప, రామయ్య, చిన్నపరెడ్డి, క్రిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

నెట్‌వర్క్ సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలో బిఎస్ఎన్ఎల్, జియో నెట్‌వర్క్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ గురువారం వినియోగదారులు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అంద జేశారు. వినియోగదారులు మాట్లాడుతూ మండలంలో నెల రోజులుగా జియో, బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ సమస్య ఉందన్నారు. దీంతో ఫోన్ వాడే వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు.

కలప అక్రమ రవాణాను అరికట్టండి

ప్రజాశక్తి - కొత్తచెరువు

బుక్కపట్నం పెనుగొండ రేంజ్‌ల పరిధిలోని అడవి ప్రాంతాల్లో చెట్లను నరికివేసి అక్రమంగా కలపలను తరలించి లక్షలలో రూపాయలు సొమ్ము చేసుకుంటు న్నారని దీన్ని అరికట్టాలని పర్యావరణవేత్త భాస్కర్ నాయుడు తెలిపారు. పెనుగొండ రేంజ్ పరిధిలో ఈ వారంలోనే 2వేల చెట్లు నరికివేసి 6 వేల టన్నులను అమ్ముకొని సొమ్ము చేసుకున్నారని విమర్శించారు. కలపను అక్రమంగా తరలిస్తున్న ఫారెస్ట్ అధికారులకు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు చైతన్యవంతులై వీటిని అడ్డుకోవాలని ఆయన కోరారు.

23న మాలల సింహగర్జన సభ

ప్రజాశక్తి-మడకశిర

ఈ నెల 23వ తేదీ కర్నూలు నగరంలో నిర్వహిస్తున్న మాలల సింహగర్జన సభను జయప్రదం చేయాలని మాల మహానాడు తాలూకా కార్యదర్శి సోమ్‌కుమార్, నాయకులు మూర్తి, జి.కృష్ణమూర్తి, గురుస్వామి, సోమన్న పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం పట్టణంలో మాల మహానాడు సింహగర్జన పోస్టర్లును విడుదల చేశారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి-మడకశిర

మండలంలోని కె.గుండుమల పిహెచ్‌సి వైద్యాధికారిణి డా వి.శాంతి ఆధ్వర్యంలో గురువారం మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మెంటల్ హెల్త్ నోడల్ ఆఫీసర్ సోమశేఖర్ హాజరై మానసిక ఆరోగ్యంపైన అవగాహన కల్పించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి షమీఉల్లా సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. డా వి.శాంతి అన్ని జాతీయ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఈఓ ఎన్.ఈశ్వరయ్య, పిహెచ్‌ఎన్ కె.ప్రమీల, సూపర్వైజర్ మెర్సీ, ఆశలత, ఎఎన్‌ఎంలు, సిహెచ్‌ఒలు, ఆశాలు పాల్గొన్నారు.

వైసిపి వార్డు మెంబర్ టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-మడకశిర

అమరాపురం మండలంలోని హలుకూరు పంచాయతీ చిట్నడుకు గ్రామానికి చెందిన వైసిపి వార్డు మెంబర్ మహేష్ గురువారం టిడిపిలో చేరాడు. అమరాపురం మండలం టిడిపి కన్వీనర్ గణేష్, మాజీ జడ్పిటిసి కెఎన్.నరసింహమూర్తి, మాజీ ఎంపీపీ కృష్ణమూర్తి, హలుకురు పంచాయతీ టిడిపి నాయకుల సమక్షంలో టిడిపిలో చేరారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.జయకుమార్, బిటి.చెన్నప్ప, జడ్పిటిసి స్వారక్క నరసింహమూర్తి, నాగరాజు పాల్గొన్నారు.



టిడిపిలో చేరిన వైసిపి వార్డు మెంబర్ మహేష్

విద్యా రంగ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-హిందూపురం

విద్యారంగ సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు మంజుళ నరేంద్ర పేర్కొన్నారు. గురువారం పట్టడంలో ప్రగతిశీల విద్యార్థి సంఘం మూడవ జిల్లా మహాసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు మంజుళ నరేంద్ర, ఆర్ ఎస్ పి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. విద్యా సంవత్సరం పూర్తి అవుతున్నప్పటికీ విద్యార్థులకు ప్రభుత్వం విడుదల చేయాల్సిన తల్లికి వందనం, ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్మెంట్‌నీ విడుదల చేయ లేదన్నారు. ఇది చాలా దున్నట్టు రాష్ట్రంలో నారాయణ, చైతన్య విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు చదువుల ఒత్తిడికి, ఫీజుల తాకిడికి విద్యాసంస్థల్లోనే ఆత్మహత్య చేసుకుంటున్నప్పటికీ ప్రభుత్వం వారిపై చర్యలు తీసుకోకుండా ఆ విద్యా సంస్థను నిర్వహిస్తున్న నారాయణకు మంత్రి పదవిని కట్టబెట్టిన దౌర్భాగ్య ప్రభుత్వం మన రాష్ట్రంలోనే ఉందన్నారు. అనంతరం సత్యసాయి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా నందకిషోర్, కార్యదర్శిగా ఇమ్రాన్‌తో పాటు జస్వంత్, నవాజ్ తదితరులను ఎన్నుకున్నారు.



జిల్లా సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు మంజుళ నరేంద్ర

ఉపాధి పనులపై సమీక్ష

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరాన్ని కరువు మండలంగా ప్రకటించిన నేపథ్యంలో అదనంగా 50 రోజులు ఉపాధి పనులను పెంచామని దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ సాయి మనోహర్ చెప్పారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా ఎంపిడిఒతో పాటు ఎపిఒ అనిల్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న ఫారం పాండ్స్, సోక్ పిట్స్, గడ్డి పెంపకం మరియు మినీ గోకులం పనులను రైతులకు అర్థమయ్యేలా తెలిపి త్వరగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఉపాధి క్షేత్ర స్థాయి సహాయకులకు తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఉపాధి కూలీలను ఉదయం 6 గంటలకే పనిలో ఉండేలా చూడాలని,పని ప్రదేశంలో ఆశా వర్క్ ద్వారా టాబ్లెట్స్, ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. వీలైనంత ఎక్కువ మందికి పనులను కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈసి అరుణ, సిఒలు వెంకటనారాయణ, లక్ష్మి నారాయణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : ఉపాధి కూలీలకు 150 రోజుల పనిదినాలను ప్రభుత్వం కల్పిస్తోందని ఎపిఒ మంజునాథ్, ఇసి సుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ ఉపాధి పథకంలో గతంలో వంద రోజుల పనిదినాలు ఉండేవన్నారు. గాండ్లపెంటను కరువు మండలం ప్రకటించడంతో అదనంగా 50 రోజులు పెంచారని 150 రోజులకు కూలీలు పనులు కల్పిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపాధి కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పరిగి విద్యార్థులు

ప్రజాశక్తి - పరిగి

ఇటీవల ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సీనియర్ ఉమెన్ హ్యాండ్ బాల్ పోటీలు ధర్మవరంలోని యశోద కాన్సెప్ట్ స్కూల్లో జరిగాయి. ఇందులో ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టుకు పరిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు హర్షవల్లి,మంజుల విద్యార్థులు అర్హత సాధించారు.వీరు కర్నూలు లో ఈ నెల 21వ తేదీన జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో శ్రీ సత్య సాయి జిల్లా తరుపున పాల్గొంటారు. ప్రతిభా విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయుడు వినోద్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏలి సత్యరాజ్ ,ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ధర్మవరం వినియోగదారుల సంఘం అధ్యక్షులుగా పళ్లెం జనార్ధన్

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని ధర్మవరం వినియోగదారుల సంఘం కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో నూతన కమిటీ అధ్యక్షుడిగా పళ్లెం జనార్ధన్, కార్యదర్శిగా కాకుమాని రవీంద్రబాబు, కోశాధికారిగా ఎన్ సుభాన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ప్రమాణ స్వీకారం నిర్వహించారు. అనంతరం ఎన్నికైన వారు మాట్లాడుతూ వినియోగదారుల సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు.

అన్నదాన పథకానికి విరాళం

ప్రజాశక్తి - కదిరి టౌన్

శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి కర్నాటక రాష్ట్రం, బెంగళూరు సిటి, మార్తహళ్ళి కి చెందిన యం.రమేష్ రెడ్డి, చంద్రిక కుటుంబ సభ్యులు విరాళం అందజేశారు. గురువారము పట్టణంలోని దేవస్థానంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి వెండుదండి శ్రీనివాసరెడ్డికి రూ. 10 లక్షల విలువైన చెక్కును అందజేశారు. దాతను ఆలయ కార్యనిర్వహణాధికారి వెండిదండి శ్రీనివాసరెడ్డి అభినందించారు.

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి-హిందూపురం

క్రీడలను అభ్యసనం చేయడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని వైసిపి నాయకులు గుడ్డంపల్లి వేణు రెడ్డి పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని మోతుకుపల్లిలో డాక్టర్ వైయస్సార్ మెమోరియల్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత సెల్ ఫోన్ లకు పరిమితం కాకుండా క్రీడలపై కూడా దృష్టి సారించాలన్నారు. నాలుగు రోజులపాటు జరిగే ఈ టోర్నమెంట్లో ఆదివారం ఫైనల్ మ్యాచ్ జరుగుతుందని నిర్వాహకులు షబ్బీర్, గుడ్డం దాదాపీర్, షాహిద్, తౌసిఫ్, ఇర్ఫాన్, నయాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జబీవుల్లా, నాయకులు మోతుకపల్లి లక్ష్మీనారాయణ, మహేష్ గౌడ్, న్యాత రెడ్డి, సడ్లపల్లి శబరీష్ రెడ్డి, ఫారూక్, అయూబ్ బేగ్, షేక్ బాబాజాన్, నవీన్‌రెడ్డి, ఇనాయత్ పాల్గొన్నారు.

కేంద్రబడ్జెట్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసన



ధర్మవరంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు


కదిరిలో సిపిఎం నాయకులు నిరసన

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని సిపిఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి నిరసనగా గురువారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సర్కిల్‌లో సిపిఎం ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు .ఈ సందర్భంగా సిపిఎం, సిఐటియు నాయకులు జంగాలపల్లి పెద్దన్న, ఎస్ హెచ్ భాష,జే.వి రమణ, ఎ. మారుతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో మన రాష్ట్రానికి నిధుల కేటాయింపులలో అన్యాయం చేసిందన్నారు. రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు నిధులు కేటాయింపులు జరగాలని, పోలవరానికి నిర్మాణానికి అవసరమైన బడ్జెట్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా లభిస్తే అనేకమంది పారిశ్రామికవేత్తలు ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు పెట్టడానికి ముందుకు వస్తారని ఆ విధంగా నిరుద్యోగ సమస్య తగ్గుతుందని, రాష్ట్రం అభివృద్ధి అవుతుందని అన్నారు. జీఎస్టీ వంద రూపాయలు వసూలు చేస్తే మన రాష్ట్రానికి కేవలం 46 రూపాయలు ఇస్తున్నదని, తెలంగాణ ప్రాంతానికి 50 రూపాయలు మాత్రమే ఇస్తున్నదని అన్నారు. ఉత్తర భారతదేశానికి 300 రూపాయల నుంచి తొమ్మిది వందల రూపాయల వరకు వెనకకు ఇస్తూ ఆ రాష్ట్రాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎల్ ఆదినారాయణ, ఎస్ హైదరవలి, ఎపి చేనేత కార్మిక సంఘం నాయకులు హరి, వెంకట స్వామి, ఖాదర్‌బాషా, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రజా వ్యతిరేక ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి జివెల్ నరసింహులు డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో కదిరి పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో కొనుగోలు శక్తి బాగా తగ్గిపోయిందన్నారు. ప్రజల కొనుగోలు శక్తి పెరగడానికి కావలసిన చర్యలు ప్రస్తుత బడ్జెట్‌లో లేవన్నారు. ఆర్థిక వ్యవస్థలో తగ్గిన డిమాండ్ సమస్యను పరిష్కరించడానికి బదులు అందుకు విరుద్ధంగా మోడీ ప్రభుత్వం సంపన్నులకు రాయితీలివ్వడం, ఖర్చుల్లో కోత పెట్టడం తీవ్ర అభ్యంతరకరం అన్నారు. నిరుద్యోగ సమస్యను ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరించింది. ఆహార సబ్సిడీలు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, సామాజిక సంక్షేమంపై పెట్టిన ఖర్చు గత ఏడాదికంటే బాగా తగ్గిపోయిందన్నారు. ఈ ప్రజా వ్యతిరేక బడ్జెట్ వ్యతిరేకిస్తూ ప్రత్యామ్నాయప్రతిపాదనలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని వామపక్ష పార్టీలు నిర్ణయించాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ నాయకులు బాబ్జాన్, శాంతిబాయి, జగన్మోహన్, ముస్తాక్, రామ్మోహన్, ఫాజిల్, ఆంజనేయులు, హేమవతి, రెడ్డమ్మ, మున్ని, ఆదిలక్ష్మి, తిరుపాల్, బాలక్రిష్ణ, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు నిరసనగా గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు సిపిఎం నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ శివన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో ప్రజా వ్యతిరేక విధానాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు వివి రమణ, ఎస్వీ రమణ, శ్రీనివాసులు, సిఐటియు జిల్లా కౌన్సిల్ సభ్యులు ఒంటెద్దు వేమన్న తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉందని దీనిని పేద మధ్యతరగతి ప్రజలు తిరస్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఈఎస్ వెంకటేష్ తెలిపారు. బడ్జెట్‌కు వ్యతిరేకంగా స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో సిపిఎం నాయకులు కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం రైతులను పేద ప్రజలను విస్మరించి సంపన్నుల కోసం బడ్జెట్లో రాయితీలు ప్రకటించిందని తెలిపారు. ప్రజల పైన పన్నుల భారాన్ని పెంచిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి బ్యాళ్ల అంజి, సిపిఎం మండల కార్యదర్శి ముత్యాలు,ఐద్వా జిల్లా కార్యదర్శి నాగమణి, కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు, ప్రసాదు,సులోచన, కృష్ణమ్మ, రమణ తదితరులు పాల్గొన్నారు

ఓబుళదేవర చెరువు : కేంద్ర బడ్జెట్ లో ఆంధ్రప్రదేశ్ కు రాయలసీమకు సత్యసాయి జిల్లాకు నిధులు కేటాయించాలని విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని సిపిఎం, ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో సుందరయ్య కాలనీలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు వివి రమణ, పెడపల్లి బాబా, జిల్లా రైతు సంఘం రామిరెడ్డి, మండల కన్వీనర్ కుళ్లాయప్ప, అంజి, నారాయణ. నరసింహులు. అద్దాల నరసింహులు. కృష్ణ, కాంతమ్మ, నరసమ్మ ,చిన్నగమ్మ, కాళ్ళ గంగ, అలివేలమ్మ. రామంజప్ప. మంజునాథ్. రామచంద్ర. శీన, సుధాకర, అంజి, రాముడు, కిష్టమ్మ, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురవారం నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఫిరంగి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ సంపన్నులకు, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు రమేష్, మండల నాయకులు రామచంద్ర, మంజునాథ్, సూర్యనారాయణ, రైతు సంఘం నాయకులు లక్ష్మి నారాయణ, సాదాశివరెడ్డి, నరసింహ, అశ్వర్థరెడ్డి, గాయిత్రి, రజియా బాను, నాగరాజు, షామీ, నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఎపికి అన్యాయం జరిగిందని సిపిఎం నాయకులు విమర్శించారు. ఈ మేరకు వారు గురువారం స్థానిక అంబేద్కర్ సర్కిల్ నందు ఒంటి కాలిపై నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేశు, ఆవాజ్ కమిటీ మండల కార్యదర్శి బాబ్జాన్, అల్లా బకాష్, పకీరప్ప, వెంగముని, రామచంద్ర ,సంకేపల్లి, ఆదెప్ప, బాల పెద్దన్న, పంచాయతీ కార్మికుడు ఓబులేసు, హరి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : కేంద్ర ప్రభుత్వం పేదలను దోచి కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతోందని, దానికి నిదర్శనమే ప్రస్తుతం ప్రవేశపెట్టిన బడ్జెట్ అని సిఐటియు పట్టణ కన్వీనర్ రాము,, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి విమర్శించారు. కేంద్ర బడ్జెట్ ను వ్యతిరేకిస్తూ గురువారం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ లో సిపిఎం, సిఐటియు, ఎస్ఎఫ్ఐ నాయకులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇప్పటికైన కేంద్ర ప్రభుత్వం సవరణ చేసి కోట్లాది మంది ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్ రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కో కన్వీనర్ రామకృష్ణ, సిఐటియు నాయకులు చంద్ర, బాబయ్య, నాగరాజు, జాఫర్, గంగాధర్, అంజనమ్మ, రఘు, రమేష్, ఇంతియాజ్, మోమిన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : కేంద్ర బడ్జెట్‌పై గురువారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. సిపిఎం మండల కార్యదర్శి రంగప్ప, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో జిల్లా అభివృద్ధికి ఏమాత్రం తోడ్పాటు అందించ లేదని విమర్శించారు. ఆహార సబ్సిడీలు, పేదలకు రాయితీలు, వ్యవసాయ రంగం అభివృద్ధి, ఉపాధి హామీ నిధుల్లో పూర్తిగా కోత విధించారన్నారు. కేంద్రం పునరాలోచించి వ్యవసాయం, ఉపాధి, విద్య, వైద్యం, పేదల రాయితీలు, ఆహార సబ్సిడీలకు నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఇంతలో పోలీసులు అక్కడికి చేరుకొని నిరసనకారులకు నచ్చజెప్పి విరమింపజేశారు. రాస్తారోకోలో కెవిపిఎస్ నాయకులు వెంకటేష్, వ్యకాసం జిల్లా కమిటీ సభ్యులు బెస్త క్రిష్టప్ప, సిపిఎం నాయకులు మాబు, గంగరాజు, రవి, ఈడిగ నాగరాజు, శీలా నారాయణస్వామి, రామాంజనేయులు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నాగభూషణ, గోవిందప్ప, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

గోరంట్ల : కేంద్ర బడ్జెట్‌పై పట్టణంలోని కనకదాసు విగ్రహం వద్ద హిందూపురం-కదిరి ప్రధాన రహదారిపై వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గం కన్వీనర్ కొండా వెంకటేశులు అధ్యక్షతన రాస్తోరోకో చేపట్టారు. వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ద న్న, జిల్లా కమిటీ సభ్యులు స్వర్ణలత మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ జిల్లా ప్రజానీకాన్ని మోసం చేసిందని విమర్శించారు. బడా పారిశ్రామికవేత్తలకు ఉపశమనం తప్ప పేదలకు న్యాయం చేసే బడ్జెట్ కాద న్నారు. కార్యక్రమంలో ఇళ్ల స్థలాల సాధన పోరాట కమిటీ కన్వీనర్ అంజనాదేవి, వ్యకాసం మండల నాయకులు ముత్యాలప్ప, వెంకటలక్ష్మమ్మ, మహిళా సంఘం నాయకురాలు ఉషా, నంజుండప్ప, ఆంజ నేయులు, ప్రదీప్, గంగాధర్, రత్నమ్మ, శోభ, అనసూయమ్మ, రామాంజనమ్మ, వెంకటమ్మ, రాజేశ్వరి, సారమ్మ పాల్గొన్నారు.

పెనుకొండ : కేంద్ర బడ్జెట్లో ప్రజా వ్యతిరేక ప్రతిపాదనలను ప్రజలు తిరస్కరించాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో సిపిఎం నాయకులు గంగాధర్ అధ్యక్షతన ప్ల కార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. సిపిఎం నాయకులు హరి, బాబావలి, చిన్న వెంకటేశులు, వెంకట రాముడు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం సంపన్నులకు రాయితీలివ్వడం, ఖర్చుల్లో కోత పెట్టడం తీవ్ర అభ్యంతరకరం అన్నారు. నిరుద్యోగులు, కార్మికులను పూర్తిగా విస్మరించారన్నారు. ఆహార సబ్సిడీలు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, సామాజిక సంక్షేమంపై పెట్టిన ఖర్చు గత ఏడాదికంటే బాగా తగ్గిపోయిందన్నారు. ఉపాధిహామీకి అదనంగా నిధులు కేటాయించలేదన్నారు. ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను వ్యతిరేకిస్తున్నామని, ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వామపక్ష పార్టీలు నిర్ణయించాయన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ, ఆటో, వ్యవసాయ కార్మికులు, రైతు సంఘం నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

నల్లమాడ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని సిపిఎం నాయకులు విమర్శించారు. ఈ మేరకు వారు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోవిందు తదితరులు పాల్గొన్నారు.


హిందూపురంలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు


పెనుకొండలో సిపిఎం నాయకుల నిరసన

కాటికాపర్ల సమస్యలను పరిష్కరించాలి : కెవిపిఎస్


వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న కాటికాపర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కుల వివక్ష పోరాట సమితి జిల్లా కార్యదర్శి రమణ డిమాండ్ చేశారు. ఈ విషయంపై గురువారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యే బాలక్రిష్ణ పిఎ బాలాజీకి అందజేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా వందలాది మంది కాటికాపర్లు శ్మశాన వాటికల్లో మృతదేహాల ఖననం కోసం గుంతలు తీయడం, శవాలను పూడ్చడం చేస్తున్నారన్నారు. కాటి కాపర్ల సేవలను గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంటి స్థలంతో పాటు ఏకరూప దుస్తులు, గ్లౌజులు, బూట్లు, భీమా, ఆరోగ్యబీమా సౌకర్యం కల్పించాలన్నారు. వారి పిల్లలకు ప్రయివేటు పాఠశాలల్లో ఉచిత విద్యను అందించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. పనిచేయలేని పరిస్థితిలో ఉన్నవారికి నెలకు రూ. 8వేలు పింఛను అందించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు రాయుడు, సరస్వతి, గంగమ్మ, చంద్రమ్మ, కాటికాపర్ల సంఘం గోపాల్, మంజు తదితరులు పాల్గొన్నారు.

చట్టం దృష్టిలో అందరూ సమానమే

ప్రత్యేక న్యాయమూర్తి ఎస్. రమణయ్య

ప్రజాశక్తి-హిందూపురం

చట్టం దృష్టిలో అందరూ సమానమేనని స్థానిక ప్రత్యేక న్యాయమూర్తి ఎస్.రమణయ్య పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సామాజిక సమస్యలపై న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. వైస్ ప్రిన్సిపల్ వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో న్యాయమూర్తి రమణయ్య మాట్లాడుతూ, చట్టానికి పేదలు, ధనవంతులు అన్న తారతమ్యం ఉండదన్నారు. న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని పేద వర్గాలకు ప్రభుత్వమే ఉచిత న్యాయ సహాయం అందించేందుకు న్యాయవాదులను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అలాగే మార్పు జరిగిన చట్టాలకు అనుగుణంగా ఆడపిల్లలకు ఆస్తి హక్కులో సమాన భాగం ఉందన్నారు. వన్ టౌన్ ఎస్ఐ శ్రీధర్ సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించి ఫిర్యాదు చేసే విధానం తదితర అంశాలపై వివరించారు. ఈ సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు కళావతి, నవేరా, మురళి, ఈశ్వరప్ప, రవికుమార్, భాగ్య, లైజనింగ్ అధికారి శ్రీనివాసులు, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి, శారద తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న ప్రత్యేక న్యాయమూర్తి ఎస్. రమణయ్య


ట్రాన్స్‌కో అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కాలనీవాసులు

విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతి

ప్రజాశక్తి - కదిరి టౌన్

పట్టణంలోని హిందూపురం రోడ్డు గట్లు వద్ద గల సుందరయ్య కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు వారు ట్రాన్స్‌కో అర్బన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షాజహాన్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు జిఎల్. నరసింహులు మాట్లాడుతూ పది సంవత్సరాల క్రితం కదిరి పట్టణం సమీపాన గట్లు వద్ద 250 మంది పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేశారన్నారు. అప్పట్లో మున్సిపల్ అధికారులు ఈ ప్రాంతాన్ని సుందరయ్య కాలనీగా గుర్తించి మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారని కానీ ఇప్పటి వరకు సౌకర్యాలు కల్పించలేదన్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి సుందరయ్య కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బాబ్జాన్, రామ్మోహన్, శాంతిబాయి, హేమ, జయశ్రీ, ఫాజిల్, సుధాకర్ రెడ్డి లబ్ధిదారులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బుక్కపట్నం

అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశానని ఎమ్మెల్యే పల్లె సింధూర తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన తాగునీటి శుద్ధి కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను ప్రధాన ఉపాధ్యాయులతో విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. 2018లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, అప్పటి శాసనసభ్యులు పల్లె రఘునాథ్ రెడ్డి సహకారంతో సుమారు రూ 2 కోట్లతో బుక్కపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని తెలిపారు అయితే ఆ తర్వాత ఏర్పడిన వైసిపి ప్రభుత్వం వాటిని పూర్తిగా పట్టించుకోలేదని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ కూటమి ప్రభుత్వం హయాంలో అర్ధాంతరంగా ఆగిపోయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాన్ని పూర్తి చేయాలని కోరారు. అదేవిధంగా డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న సైన్సు మ్యాథ్స్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో అంగన్వాడీ టీచర్లకు జరుగుతున్న శిక్షణ తరగతులకు ఎమ్మెల్యే హాజరై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసి 9వ తరగతి విద్యార్థులకు సైన్స్ పాఠాలను బోధించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ మల్లి రెడ్డి ,టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంఇఒ గోపాల్ నాయక్, నాయకులు గంగాధర్, వెంకటరాముడు, మాజీ సర్పంచి సాకే యశోద , వెంకట నారాయణ రెడ్డి, సుబ్బారెడ్డి, చెన్నకృష్ణ, బాలు,లావణ్య గౌడ్, గొర్లకృష్ణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ కౌన్సిలర్ సాయి తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందుకుంటున్న ఎమ్మెల్యే పల్లె సింధూర

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని కుర్లపల్లి గ్రామానికి చెందిన రామాంజనేయులు(26) గురువారం ఉరి వేసుకుని మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. కుర్లపల్లి గ్రామానికి చెందిన సాకమ్మ, వెంకటప్ప దంపతులకు ఇద్దరు కొడుకులు. వారిలో రెండో సంతానమైన రామాంజనేయులు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ ఉండేవాడు. పెళ్లి చేయమని కొంతకాలంగా ఇంట్లో వారితో వత్తిడి చేసేవాడు. పెళ్లి ప్రయత్నాలు చేసినా సంబంధం కుదరలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది గ్రామ సమీపంలోని ఓ చెట్టుకు ఉరి వేసుకొన్నాడు. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ నరేంద్ర సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని హిందూపురం ఆసుపత్రికి తరలించారు. అలాగే కేసు నమోను చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఘర్షణ .. పరస్పరం ఫిర్యాదు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి మున్సిపల్ నీటి విషయంలో గొడవపడిన పలువురు పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు.కదిరి టౌన్ నల్లగుట్ట వీధిలో నివాసము ఉండే కుంట్లపల్లి సుగుణమ్మ, పక్కింటిలో ఉండే జల్లా ఉదయ లక్ష్మి మధ్య కొళాయి నీటి విషయములో ఈనెల 18న ఘర్షణ పడ్డారు. 19న ఉదయం 11 గంటల సమయములో కదిరి వెలుగు ఆఫీసు సమీపములో ఉన్న ఎర్ర కోట కాలనీలో ఇరువర్గాలకు చెందిన వారు కుంట్లపల్లి సుగుణమ్మ , నాగన్న, అరుణ్ మరికొంత మంది వ్యక్తులు, జల్లా ఉదయ లక్ష్మి ఆమె బంధువులు ఒకరికొకరు కొట్టుకుని గాయపడి కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. ఈ ఘటనలో ఇరువర్గాలు ఇచ్చిన పిర్యాధుల మేరకు పరస్పర కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అసభ్యకర పోస్టులపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ధర్మవర టౌన్

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై అసభ్యకరమైన పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాసపల్లి సాయికుమార్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు సంబంధం లేకుండా విదేశాలలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న అమ్మాయిలపై అసభ్యంగా ప్రచారం చేయడం సిగ్గుమాలిన చర్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో లాయర్ ఫక్రుద్దీన్, వైసిపి నాయకులు గుర్రం శ్రీనివాసరెడ్డి, చందమూరి నారాయణరెడ్డి, షేక్ చాంద్ బాషా, చౌడప్ప తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుడిపై దాడి అమానుషం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం మనేసముద్రం వద్ద సీనియర్ పాత్రికేయుడు ప్రశాంత్ పై జరిగిన దాడిని ప్రజాసంఘాల నాయకులు ఖండించారు. గురువారం స్థానిక ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో జరిగే అన్యాయాలు అక్రమాలను వెలికి తీసే పాత్రికేయులపైనే దాడులు చేస్తే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. శ్రీపతి ట్రేడర్స్ యజమాని జీవన్ రెడ్డిఏఇఅరెస్టు చేయని పక్షంలో ప్రజాసంఘాలన్ని ఏకమై పాత్రికేయులకు అండగా ఉంటూ దశలవారీగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి, జై భీమ్ పార్టీ జిల్లా అధ్యక్షులు నాగరాజు, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, ఆర్‌సిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, జూనియర్ అడ్వకేట్ ఈశ్వర్, మధు, రామంజి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ప్రతిపక్ష నాయకుడిగా ఆసిఫుల్లా

హిందూపురం : హిందూపురం మున్సిపల్ ప్రతిపక్ష నాయకుడిగా వైసిపి 30 వ వార్డు కౌన్సిలర్ ఎస్ఎం ఆసీఫుల్లాను, ఉప ప్రతిపక్ష నాయకుడిగా 24 వ వార్డు కౌన్సిలర్ నాగేంద్ర కుమార్‌ను ఎన్నుకున్నారు. గురువారం స్థానిక వైసిపి కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణు రెడ్డి సమక్షంలో వైసిపి కౌన్సిలర్లు సమావేశమై ప్రతిపక్ష, డిప్యూటీ ప్రతిపక్ష నాయకులను ఎన్నుకున్నారు.